క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే కిలారి



సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, నాయకులు

చేబ్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రితో వివిధ అంశాలను చర్చించారు. ఆయనతో పాటు పెదకాకాని ఎంపీపీ టి.శ్రీనివాసరావు, చేబ్రోలు, జేసీఎస్ కన్వీనర్లు కుర్రా పాములు, చాగంటి మురళి ఉన్నారు. ముఖ్యమంత్రిని కలిశారు.

వారాహి యాత్ర ప్రజల కోసమా.. చంద్రబాబు కోసమా?

గుంటూరు రూరల్: పవన్ కల్యాణ్ వారాహి అంటే యుద్ధ ట్యాంకర్ అనుకొనే భ్రమలో ఉన్నారని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోనూరి సతీష్ శర్మ పేర్కొన్నారు. సోమవారం నగర శివారురులోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం నేరుగా ప్రజలకు అందుతున్న తీరు వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల మ్యానిఫెస్టో లేకుండానే వారాహిలో యాత్ర చేస్తున్న పవన్‌ను ప్రజలు ఎందుకు ఆదరించాలని అన్నారు. చంద్రబాబును సీఎం చేయాలనే కోరిక తప్ప వేరే ఆలోచన పవన్ కల్యాణ్‌కు లేదన్నారు.

టీడీపీ నేతలవి శవ రాజకీయాలు

పొన్నూరు ఏఎంసీ చైర్మన్ ఆకుల



చేబ్రోలు: తెలుగుదేశం పార్టీ నాయకులు శవ రాజకీయాలతో లబ్ధి పొందాలని చూస్తున్నారని పొన్నూరు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక ఏఎంసీ చాంబర్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న మార్కెటింగ్ యాడ్ ఉద్యోగి షేక్ హుస్సేన్ బాషు విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదం జరిగి మరణిస్తే టీడీపీ నాయకులు, పచ్చ మీడియా ద్వారా దానిని హత్యగా చూపి.. పార్టీ, ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న మార్కెటింగ్ ఉద్యోగి షేక్ హుస్సేన్ బాషు లారీని ఆపే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు లారీ కిందపడి మృతి చెందారని తెలిపారు. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పరామర్శించారని చెప్పారు. ప్రమాద ఘటనపై చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని, మృతుని కుటుంబానికి సహాయం అందించేందుకు చూస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమి వైఎస్సార్ సీపీపై బురద జల్లడం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆయన అనుచరులు ధర్నాలు చేపడుతున్నారని మండిపడ్డారు. ప్రమాదానికి కారకులైన లారీ డ్రైవర్, ఓనర్లు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులేనన్న విషయాన్ని వారు గుర్తించాలని హితవు పలికారు.

గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులివ్వాలి



ప్రత్తిపాడు: గుంటూరు చానల్ పొడిగింపునకు ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. గుంటూరు చానల్ పొడిగింపు సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న గుంటూరులో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్షను చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సంఘ నాయకులు పాతమల్లాయపాలెం, ప్రత్తిపాడు గ్రామాల్లో పర్యటించారు. రైతులకు గుంటూరు చానల్ పొడిగింపు ఆవశ్యకతను వివరించారు. గుంటూరులో జరగనున్న దీక్షలో పాల్గొని రైతుల గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని కొల్లా రాజమోహన్ కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులను కేటాయించడంతో పాటు రైతుల భూములకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల రైతులు వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, రామన్, మహమ్మద్ బాష, పుల్లారెడ్డి, అంకిరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, సాంబిరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రేపు బండ్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు, బాపట్ల దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు

- అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు
- పిల్లిపెసర, జనుము, జీలుగ ఇతర రకాలు
- ఏపీ సీడ్స్ ద్వారా రాయితీపై అందజేత

ప్రత్తిపాడు: రైతులకు రాయితీపై పన్నెండు రకాల విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే పచ్చిరొట్ట ఎరువులను 50 శాతం రాయితీపై అందిస్తుండగా, వర్షాలు కురవడం, భూములు వ్యవసాయానికి పదునెక్కడంతో ఇప్పుడు వరి, మినుము, పెసర, కందులు.. వంటి పలు రకాల విత్తనాలను కూడా ఏపీ సీడ్స్ ద్వారా అందజేస్తోంది. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకే సిబ్బందిని లేదా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించి, పొందవచ్చని ఏవో అరుణకుమారి తెలిపారు.



ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

కావలసిన రైతులకు తెప్పించి ఇస్తాం

ఏపీ సీడ్స్ ద్వారా మొత్తం 12 రకాల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందిజేస్తోంది. పచ్చిరొట్ట ఎరువులను 50 శాతం రాయితీపై ఇచ్చాం. ఇప్పుడు వరి, కందులు, పిల్లిపెసర, మినుము కూడా రాయితీపై ప్రభుత్వం ఇస్తోంది. కావలసిన రైతులు ఆర్బీకే సిబ్బందికి గానీ, వ్యవసాయశాఖ కార్యాలయంలో గానీ సంప్రదించాలి. ఆయా గ్రామాలు లేదా ఆర్బీకేల ద్వారా ఒక్కసారే అధిక మొత్తంలో విత్తనాలు తెప్పించి, రైతులకు అందిస్తాం.

– అరుణకుమారి, ఏవో, ప్రత్తిపాడు.

రాయితీపై అందిస్తున్న విత్తనాల ధరలు ఇలా..

విత్తనం రకం	కేజీ ధర(రూ.ల్లో)	రాయితీ అనంతరం ధర	విత్తనం రకం	కేజీ ధర(రూ.ల్లో)	రాయితీ అనంతరం ధర
జీలుగ	రూ. 79	రూ. 39.50	వరి-ఎన్ఎల్ఆర్-33892	రూ. 34.65	రూ. 29.65
జనుము	రూ. 84	రూ. 42	వరి- ఆర్ఎన్ఆర్-15048	రూ. 36.90	రూ. 31.90
పిల్లిపెసర	రూ. 97	రూ. 48.50	మినుములు-పీయూ-31	రూ. 117.50	రూ. 82.25
వరి-బీపీటీ- 5204	రూ. 37.90	రూ. 32.90	మినుములు- టీబీజీ- 104	రూ. 117.50	రూ. 82.25
వరి-ఎంటీయూ-1224	రూ. 37.30	రూ. 32.30	పెసర- ఐపీఎం 2-14	రూ. 117.50	రూ. 82.25
వరి-ఎంటీయూ-1061	రూ. 38.10	రూ. 33.10	కందులు-ఎల్ఆర్‌జీ 52	రూ. 111.40	రూ. 77.98

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి

రూ.10 లక్షలతో పది బోర్ల ఏర్పాటుకు శంకుస్థాపన



బోర్లకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్యామల

గుంటూరు రూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధికి, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని పొత్తూరు, చౌడవరం గ్రామాల్లో ప్రజల తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు రూ.10 లక్షలతో పది నూతన బోర్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇప్పటికే డివిజన్ పరిధిలో రూ.కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. శివారు కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా బోర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, వార్డు సచివాలయం సిబ్బంది, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు.

'విజ్ఞాన్' ఎన్‌సీసీ విద్యార్థులకు 'బీ' సర్టిఫికెట్ల ప్రదానం



బీ సర్టిఫికెట్స్‌ను చూపుతున్న విద్యార్థులతో ప్రిన్సిపల్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 30 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు గుంటూరులోని 10 ఆంధ్ర గరల్స్ బెటాలియన్‌కు చెందిన హవల్దార్ తేజేంద్రకుమార్, సుబేదార్ గురువిందర్ సింగ్ సోమవారం '' బీ '' సర్టిఫికెట్స్‌ను అందజేసినట్లు ప్రిన్సిపల్ కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. రాత పరీక్ష, ప్రాక్టికల్స్‌కు హాజరైన 30 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతతో సర్టిఫికెట్స్ సాధించారని తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థులు వడ్లమూడి గ్రామంలో '' టేక్ ఏ స్టాండ్- బీ డ్రగ్ ఫ్రీ'' అనే నినాదంతో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడుపై మానసిక ఒత్తిడి, శరీరంలోని అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. డ్రగ్స్ సేవించడం మొదలుపెడితే దాని నుంచి బయటపడటం అంత సులువు కాదన్నారు. ఎన్‌సీసీ ''బీ'' సర్టిఫికెట్స్‌ను సాధించిన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



క్యాంపస్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు..

గుంటూరు రూరల్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములవ్వాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను, వాటిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను, చట్టాలను వివరించారు. బ్యానర్లను, ప్లకార్డులను ప్రదర్శిస్తూ, కళాశాల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ డ్రగ్స్ మారక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ఫలితాల గూర్చి ప్రజల్లో చైతన్యం నింపేందుకు, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే మాదక ద్రవ్యాల వాడకానికి విద్యార్థులు దూరంగా ఉంటూ వాటివల్ల కలిగే నష్టాలను ప్రతి ఒక్కరికి వివరిస్తూ, అవగాహనను కల్పించాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సమాజంలో మంచి పౌరులుగా నిలిచేందుకు విద్యార్థులు కృషి చేయాలని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్ తెలిపారు. డైరెక్టర్స్ డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.సుధాకర్, డాక్టర్ జి.రామ్మోహన్‌బాబు, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, డాక్టర్ ఎస్.రాధిక, డాక్టర్ ఉషాక్రాంతి, డాక్టర్ తారాచంద్ పాల్గొన్నారు.

వర్క్ షాప్‌ను జయప్రదం చేయండి

పెదకాకాని: పెదకాకాని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం శంకర కంటి హస్పిటల్ వద్ద ఆటో కార్మికుల సమావేశం కేసాని గోపీ అధ్యక్షతన జరిగింది. ఏఐఆర్‌టీ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు పాత గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆటో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు జిల్లా వర్క్ షాపు బి.లక్ష్మణరావు అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పాల్గొంటారని తెలిపారు. మోటార్ వాహనాల డ్రైవర్ల సమస్యలపై చర్చిస్తారని జిల్లాలో ఆటో, లారీ ట్రాన్స్‌పోర్టు వివిధ వాహనాల యూనియన్ల బాధ్యులు అందరు పాల్గొనాలని కోరారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వాహనాల చట్టం సవరణ చేసి జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు భారీ మొత్తంలో పెంచారని చెప్పారు. ఇప్పటికే బాడుగు లేక ప్రతి నెలా కిస్తీలు చెల్లించలేక ఫైనాన్సర్లతో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆటో నాయకులు కె.కొండలు, లక్ష్మీనారాయణ ఏసు బాబు నరసింహారావు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు రూరల్: గుట్టుచప్పుడు కాకుండా నగర శివారులో ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకురాలిని నల్లపాడు పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు గోరంట్ల శివారులో ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి గృహ నిర్వాహకురాలు బండ్ల తులసి, భర్త బాలానందకుమార్, వీరితోపాటు ఒక మహిళ, నలుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

గుంటూరు రూరల్: నగర శివారులో పేకాట స్థావరాలపై నల్లపాడు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గోరంట్ల శివారులో ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 4,200లు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నల్లపాడు శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,400లు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎంఈవో-2 లీలారాణి



పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎంఈవో-2 లీలారాణి, పక్కన ఎంఈవో సీహెచ్ రమాదేవి

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందని ఎంఈవో-2 లీలారాణి అన్నారు. ప్రత్తిపాడులోని రామానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో సీహెచ్ రమాదేవి, ఎంఈవో-2 లీలారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సీఎం చేసిన ప్రసంగాల వీడియోలను ప్రదర్శించి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా లీలారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఎంఈవో సీహెచ్ రమాదేవి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మన బడి నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేసిందని చెప్పారు. అంతేకాకుండా జగనన్న గోరుముద్దతో నాణ్యమైన భోజనం, రాగిజావ, చిక్కీలు, కోడిగుడ్లు అందిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నజీర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగిస్తే జీవితం జైలుపాలు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సెబ్ ఎస్ఐ గీత

ప్రత్తిపాడు: డ్రగ్స్ వినియోగిస్తే జీవితాలు జైలు పాలవుతాయని సెబ్ ఎస్ఐ గీత అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడులోని శ్రీనివాస హైస్కూల్లో సోమవారం ఎస్ఈబీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు, సే ఎస్ టు లైఫ్-నో టు డ్రగ్స్ అంటూ ప్లకార్డులు చేతబట్టి విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాలలో మానవహారంగా ఏర్పడ్డారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ఎస్ఐ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గీత మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ జీవితాలతో పాటు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయని చెప్పారు. డ్రగ్స్ ఆనవాళ్లు కనబడినా, వినియోగిస్తూ ఎవరైనా కనిపించినా 14500 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి, చెప్పాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ బాపతు శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, బాష తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతికి..సామాజిక విజ్ఞాన కళాశాల దోహదం

ఘనంగా కమ్యూనిటీ సైన్స్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం



కళాశాల విద్యార్థినులతో డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి, అధ్యాపకులు

గుంటూరు రూరల్: సామాజిక రంగాల్లో మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు సామాజిక విజ్ఞాన కళాశాల ఎంతో కృషి చేస్తుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కమ్యూనిటీ సైన్స్ కళాశాల డీన్ డాక్టర్ చిరంజీవి తెలిపారు. సోమవారం నగర శివారులోని లాం ఫాం నందున్న కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో 10వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ విద్యార్థులకు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. 2013లో గృహ విజ్ఞాన కళాశాలగా ఎస్‌వీఎన్ కాలనీలో కళాశాలను స్థాపించటం జరిగిందన్నారు. ఆనాడు 25 మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం197 మందితో కళాశాల కొనసాగుతోందన్నారు. 2016లో సామాజిక విజ్ఞాన కళాశాలగా పేరు మార్చి లాంఫాం నందు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 2021లో ఐకార్ అక్రిడేషన్‌ను పొందినట్లు చెప్పారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్య కుమారి విద్యార్థినులు పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. కళాశాలకు వచ్చిన అవార్డులు, పూర్వ విద్యార్థులు పొందిన అవకాశాలను తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలు వివరిస్తూ.. అర్హతలు పరిశీలిస్తూ

చురుగ్గా 'జగనన్న సురక్ష' సర్వే



పాతమల్లాయపాలెంలో జరుగుతున్న 'జగనన్న సురక్ష' సర్వే

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): 'జగనన్న సురక్ష' సర్వే చురుగ్గా జరుగుతోంది. వలంటీర్లు, అధికారులు, గృహ సారథులు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి ప్రజలను పలకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా వివరిస్తూ, అర్హతలను పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం మొదటి రోజున పాతమల్లాయపాలెం సచివాలయం పరిధిలో జరగనున్నది. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలోని వలంటీర్లు డోర్ టు డోర్ తిరుగుతున్నారు. సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారి వివరాలను సేకరిస్తున్నారు. పథకాలకు అర్హత ఉన్నప్పటికీ లబ్ధిపొందని వారిని గుర్తించి, వారి నుంచి పథకానికి కావలసిన అన్ని రకాల డాక్యుమెంట్లను తీసుకుంటున్నారు. పాత మల్లాయపాలెం గ్రామంలో జరుగుతున్న సర్వేను సోమవారం ఎంపీడీవో శ్రీరమ్య పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. మహిళలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఈ నెల 30 వరకు వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందని అర్హులను గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి రుసుం లేకుండా పదకొండు రకాల ధృవీకరణ పత్రాలను జగనన్న సురక్ష క్యాంప్‌లో అందిస్తుందని ఎంపీడీవో చెప్పారు. వెంట కార్యదర్శి నాగిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చినుకు స్పర్శతో.. విత్తుకు అదును



పత్తి విత్తనాలు విత్తుకునేందుకు అరకతో సాళ్లు తోలుతున్న రైతు



ట్రాక్టర్‌తో దుక్కి దున్ని, పంట భూమిని బాగుచేస్తున్న రైతు

చినుకు తాకిన నేలలో విత్తు పడింది. భూ మాత అదును చూపడంతో.. రైతన్న హలంతో సిరులు పంటకు సన్నద్ధమయ్యాడు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. వెద పద్ధతిలో విత్తనాలు విత్తుకుంటున్నారు. సోమవారం వెంగళాయపాలెంలోని పంట భూముల్లో పత్తి విత్తనాలను రైతులు విత్తుకున్నారు. ఆర్బీకే, వ్యాసాయశాఖ సిబ్బందికి వారికి సూచనలు, సలహాలు అందించారు. – గుంటూరు రూరల్




వెద పద్ధతిలో వరిసాగుకు విత్తన శుద్ధి చేస్తున్న రైతు



ఆర్బీకే, వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో విత్తుతున్న రైతులు, కూలీలు

జగనన్న కాలనీలో రోడ్లు వేయించరూ..



తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు అర్జీ అందజేస్తున్న కృష్ణారెడ్డి

ప్రత్తిపాడు: జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో రోడ్లు వేయించాలని ప్రత్తిపాడు వాసి కసిరెడ్డి కృష్ణారెడ్డి స్పందనలో అధికారులకు వినతి పత్రం అందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జగనన్న లేఅవుట్‌లో ఇటీవలే ఇల్లు నిర్మించుకుని అక్కడ నివసిస్తున్న కృష్ణారెడ్డి కాలనీ వాసుల సమస్యను విన్నవించారు. మండలంలోనే అతి పెద్ద లేఅవుట్ గ్రామానికి దగ్గరగా ఉండటంతో ఎక్కువ మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. అంతేకాకుండా అక్కడే నివాసం కూడా ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మురుగు ముందుకు వెళ్లే మార్గం లేకపోవడంతో పాటు రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అధికారులు త్వరితగతిన రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అర్జీలో పేర్కొన్నారు. ఈ మేరకు అర్జీని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మాణిక్యరావుకు అందించారు.